భీమదేవరపల్లి: డెయిలీలో అత్యధికంగా పాలుపోసిన సభ్యురాలిని సన్మానిస్తున్న అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీ

సుబేదారి : హనుమకొండలోని సీపీ ఆఫీస్‌లో మహిళా దినోత్సవంలో కేక్ కట్ చేస్తున్న డీసీపీ సలీమా

నయీంనగర్ : మహిళలను సన్మానిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

- వివిధ రంగాల్లో సేవలందిస్తున్నస్త్రీలు, అధికారులు, ఉపాధ్యాయినులకు సన్మానం
- మహిళ లు సామాజిక, ఆర్థిక రంగాల్లో రాణించాలని వక్తల పిలుపు

శాయంపేట : మహిళా పోలీసులను సన్మానిస్తున్న ఏసీపీ సతీశ్‌బాబు

కాజీపేట : వడ్డేపల్లి ట్యాంక్‌బండ్‌పై మహిళలను సన్మానిస్తున్న వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు

హనుమకొండ : మహిళా దినోత్సవంలో పాల్గొన్న మహిళలు

ఆత్మకూరు : మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పీఆర్టీయూ బాధ్యులు

నమస్తే నెట్‌వర్క్, మార్చి 8 : జిల్లాలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. హనుమకొండలోని వడ్డేపల్లి ట్యాంక్‌బండ్‌పై వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలను సన్మానించారు. బాపూజీనగర్ పోచమ్మగుడి ప్రాంగణం తేజోమయి మాల కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మర్యాల కృష్ణ ఆధ్వర్యంలో మహిళలను సత్కరించారు. సోమిడి కమ్యూనిటీ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ హాజరయ్యారు. కాజీపేట రైల్వే డీఎల్ఎస్ షెడ్డులో రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాజీపేట రైల్వే సబ్ డివిజన్ సెక్రటరీ వసంత కుమారి క్రీడల్లో ప్రతిభ కనబర్చిన మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు. కాజీపేట ఆర్పీఎఫ్ స్టేషన్‌లో మహిళ దినోత్సవం నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హనుమకొండ శాఖ పాలకవర్గం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి చైర్మన్ డాక్టర్ విజయచందర్, ఆత్మకూరులో పీఆర్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో ఎంఈవో విజయ్‌కుమార్, భీమదేవరపల్లి మండలంలోని వంగర ప్రభుత్వాస్పత్రిలో జరిగిన వేడుకలకు డీఎంహెచ్‌వో అప్పయ్య హాజరయ్యారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. మహిళల పరస్పర సహకారంతో ముల్కనూరు మహిళా సహకార డెయిరీ ఆర్థికాభివృద్ధిలో నడుస్తున్నదని అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీ తెలిపారు. డెయిరీ ప్రధాన కార్యాలయంలో కేంద్రానికి సమితి స్థాయిలో అత్యధికంగా పాలుపోసిన సభ్యులకు బహుమతులు అందజేశారు. కొత్తగా తయారు చేసిన డైరీ, బ్రోచర్ ఆవిష్కరించారు. డెయిరీ జీఎం మారుపాటి భాస్కర్‌రెడ్డి ఉన్నారు. కమలాపూర్ మండలంలోని జరిగిన కార్యక్రమాలకు ఎంపీడీవో బాబు హాజరయ్యారు. దామెర మండలంలోని డీస్నీల్యాండ్-ఇ -టెక్నో స్కూల్, ఏకశిల పాఠశాల, దామెరలోని అంగన్‌వాడీ కేంద్రంలో వేడుకలు జరిగాయి. శాయంపేట పోలీస్‌స్టేషన్‌లో పరకాల ఏసీపీ సతీశ్‌బాబు మహిళా కానిస్టేబుళ్లు స్రవంతి, ఆసియా బేగం, లులీనాను సన్మానించి బహుమతులు అందజేశారు. శాయంపేటలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, నృత్యం, నాటిక పోటీలు నిర్వహించి విజేతలకు ప్రిన్సిపాల్ రజినీ బహుమతులు అందజేశారు. హసన్‌పర్తిలోని స్కిల్‌స్టాక్ పాఠశాలలో నిర్వహించిన వేడుకలకు టీఎస్‌జీహెచ్ఎంఎ రాష్ట్ర అధ్యక్షుడు రాజలింగారెడ్డి హాజరై మహిళా హెచ్ఎంలను సన్మానించారు. హనుమకొండ భవానీనగర్ సన్‌షైన్ ప్లే స్కూల్‌లో గైనకాలజిస్టు స్ఫూర్తిరావు మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. 40 సంవత్సరాలు దాటిన మహిళలు సంవత్సరానికి ఒకసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ధర్మసాగర్‌లోని ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం అనిత, ధర్మసాగర్ కేజీబీవీలో ఎస్‌వో మాధవి, దేవునూరు అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ వాసవి కేక్ కట్ చేశారు. మడికొండ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐ నాగమణి, కానిస్టేబుళ్లు సమీరా, విజయలక్ష్మి, ప్రియాంకను ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్, ఎస్సై రాజ్‌కుమార్, తెలంగాణ సాంఘిక సంక్షేమ కళాశాలలో ప్రిన్సిపాల్ బత్తుల కుమారస్వామి ఉపాధ్యాయినులను సన్మానించారు. కడిపికొండ మున్సిపల్ భవనంలో మహిళా నాయకురాలు నర్మెట కృష్ణవేణి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు చీరెలు పంపిణీ చేసి సన్మానించారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో దీన్‌దయాళ్ నగర్‌లో జరిగిన కార్యక్రమంలో నిట్ ప్రొఫెసర్ రాగ సుధ, జిల్లా సమతా కన్వీనర్ చాగంటి మంజుల మాట్లాడుతూ.. సమాజ పునర్నిర్మాణానికి మహిళలే ఆధారమని, ప్రశ్నించేతత్వం, శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలన్నారు. హనుమకొండలోని వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. హనుమకొండ పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ సతీశ్ మహిళా సిబ్బందిని సన్మానించారు. మహిళలు ఆలోచనలను ఆచరణలో పెట్టే స్థాయికి చేరితేనే నిజమైన మహిళా దినోత్సవం అని అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, కేయూ పాలకమండలి సభ్యురాలు అనితారెడ్డి అన్నారు. నక్కలగుట్టలోని అంధ ఉద్యోగుల సంఘ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని 49వ డివిజన్ కార్పొరేటర్ మానస-రాంప్రసాద్ అ న్నారు. రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ కాచిగూడ భవనంలో నిర్వహించిన కార్యాక్రమానికి ఆమె హాజరయ్యారు.

న్యూశాయంపేట : మానసను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

మడికొండ : ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ కుమారస్వామి

హసన్‌పర్తి : మహిళా హెచ్ఎంలను సన్మానిస్తున్న రాజలింగారెడ్డి

నేడు పద్మశాలి సంఘం మండల కమిటీ ఎన్నిక

శాయంపేట, మార్చి 8 : పద్మశాలి సంఘం మండల కమిటీని ఆదివారం ఎన్నుకోనున్నట్లు అడ్‌హక్ కమిటీ మండలాధ్యక్షుడు వావిలాల వేణుగోపాల్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. స్థానిక చేనేత సహకార సంఘం భవనంలో మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశామని, ఇందులో మండల కమిటీ ఎన్నిక జరుగుతుందన్నారు. ఎన్నికల అధికారిగా పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు చందా మల్లయ్య, రాష్ట్ర సంఘం సలహాదారులు బాసాని చంద్రప్రకాశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పాశికంటి రాజేంద్రప్రసాద్, జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు బిల్లా యాదగిరి హాజరవుతున్నట్లు తెలిపారు. సంఘం గ్రామ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, జాయింట్ సెక్రటరీ, కోశాధికారి తప్పక హాజరై మండల నూతన అధ్యక్షుడు, కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని కోరారు.

చెన్నకేశవస్వామి జాతర పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

దామెర, మార్చి 8 : మండలంలోని కోగిల్వాయి శ్రీచంద్రగిరి చెన్నకేశవ స్వామి జాతర పోస్టర్‌ను ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి శనివారం హనుమకొండలోని ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందదర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ నెల 12 నుంచి 27వ తేదీ వరకు జరిగే చంద్రగిరి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు, కల్యాణ వేడుకలకు వచ్చే భక్తులకు సౌకర్యాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జాతర చైర్మన్ జంగిలి చందర్, వైస్ చైర్మన్ పెనుకుల ప్రదీప్, గుండా సురేశ్, గుండా చందు, జంగిలి వేణు, సంగనబోయిన భిక్షపతి, గోల్కొండ సందీప్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రొఫెసర్ వెంకయ్య

యూజీసీ నూతన బిల్లుతో యూనివర్సిటీలు నిర్వీర్యం

హనుమకొండ, మార్చి 8 : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యుజీసీ నూతన ముసాయిదా, బిల్లు యూనివర్సిటీ స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే విధంగా ఉన్నాయని కేయూ ప్రొఫెసర్ వెంకయ్య అన్నారు. శనివారం పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశం సుబేదారిలోని ఆర్ట్స్ కళాశాలలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠ్యాంశాలను మారుస్తూ చరిత్రను వక్రీకరిస్తూ విద్యారంగాన్ని అశాస్త్రీయం వైపు తీసుకెళ్లడానికి బీజేపీ ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు. దేశంలో విద్య పేద వర్గాలకు అందని ద్రాక్షల మారిందన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, నాగరాజు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వానికి విద్యారంగంపై కనీస చిత్తశుద్ధి లేదన్నారు. రూ.7వేల కోట్లకుపైగా రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులు పెండింగ్‌లో ఉన్నాయని, విద్యార్థులకు యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం వల్ల ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు రాచర్ల బాలరాజు, పీడీఎస్‌యూ మాజీ సహాయ కార్యదర్శి బండి కోటేశ్వర్ పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన వ్యవసాయ కనెక్షన్ల మంజూరు

హనుమకొండ, మార్చి 8 : తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి వెన్నెముకైన రైతుల కోసం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తూ యుద్ధప్రాతిపదికన వ్యవసాయ సర్వీస్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నామని హనుమకొండ సర్కిల్ ఎస్ఈ మధుసూదన్ రావు తెలిపారు. సర్కిల్ పరిధిలో ఇప్పటివరకు 67,604 వ్యవసాయ సర్వీస్ కనెక్షన్లు ఉండగా, 2024 నుంచి 2025 ఫిబ్రవరి వరకు కొత్తగా 1,255 మంజూరు చేశామని చెప్పారు. 2023 సంవత్సరంతో పోల్చుకుంటే దాదాపు 10 శాతం పెరిగిందన్నారు. వ్యవసాయ సర్వీసుల మంజూరుకు తీసుకోవాల్సిన సత్వర చర్యలన్నీ తీసుకుంటూ త్వరితగతిన రిలీజ్ చేస్తున్నామన్నారు.

ధ్యానోత్సవం విజయవంతం చేయాలి

ఆత్మకూరు, మార్చి 8 : మండల కేంద్రంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో సోమవారం శ్రీరామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్ సంస్థ ఆధ్వర్యంలో ధ్యానోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మాధశఋులత, చంద్రమౌళి తెలిపారు. బుధవారం సాయంత్రం వరకు ధ్యాన అభ్యాసం చేయిస్తామన్నారు. కార్యక్రమంలో రామచంద్ర మిషన్ సభ్యులు శశిధర్, ఉప్పలయ్య, పద్మావతి, ప్రకాశ్, టింగిళికారి సత్యనారాయణ, కరివేద సమ్మిరెడ్డి, శివప్రసాద్ పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్

సుబేదారి, మార్చి 8 : వరంగల్ ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ శనివారం కమిషనరేట్‌లోని తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఈస్ట్‌జోన్ పరిధిలోని ఎస్సైలు, ఇన్‌స్పెక్టర్లు, ఏసీపీలు మర్యాదపూర్వకంగా డీసీపీని కలిశారు.

23న జాబ్ మేళా

నయీంనగర్, మార్చి 8 : ఈ నెల 23న నయీంనగర్‌లోని వాగ్దేవి కళాశాల ఆడిటోరియంలో నాయిని విశాల్ ట్రస్టు ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 481 కేసుల పరిష్కారం

లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న ప్రధాన న్యాయమూర్తి శాలిని లింగం

పరకాల, మార్చి 8 : జాతీయ లోక్ అదాలత్‌లో 481కేసులు పరిష్కరించినట్లు పరకాల కోర్టు ప్రధాన న్యాయమూర్తి శాలిని లింగం అన్నారు. శనివారం పట్టణంలోని కోర్టు ఆవరణలో పలు కేసుల్లో కక్షిదారులను రాజీ కుదిర్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజీ మార్గంతో ఇరు వర్గాలకు సత్వర న్యాయం జరుగుతుందన్నారు. లోక్ అదాలత్‌లో 481కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. రెండో తరగతి మెజిస్ట్రేట్ కొప్పుల శంకర్, ఏపీపీలు రుధిర, కుమార్, లోక్ అదాలత్ సభ్యులు ఒంటేరు రాజమౌళి, వెంకటరమణ, రవికుమార్, ఏసీపీ సతీశ్‌బాబు పాల్గొన్నారు.

రుద్రేశ్వరాలయంలో విదేశీ జర్నలిస్టుల సందడి

హనుమకొండ చౌరస్తా, మార్చి 8 : చారిత్రక రుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల దేవాలయంలో విదేశీ జర్నలిస్టులు సందడి చేశారు. కెన్యా, శ్రీలంక, నైజీరియా, నేపాల్, టాంజానియా దేశాలకు చెందిన విదేశీ జర్నలిస్టులు వేయిస్తంభాల దేవాలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అనిల్‌కుమార్ వారికి ప్రసాదం అందజేశారు. వరంగల్ జిల్లా టూరిజం శాఖ బాధ్యులు ఆలయ ప్రాశస్త్యాన్ని వారికి వివరించారు. జిల్లా టూరిజం శాఖ అధికారి శివాజీ, సిబ్బంది మధుకర్ పాల్గొన్నారు.

విదేశీ జర్నలిస్టులతో ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ

మహిళలను సన్మానిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్

మహిళ లను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్

నయీంనగర్, మార్చి 8 : కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను మోసం చేసిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. 58వ డివిజన్‌లో పని చేస్తున్న మున్సిపల్ కార్మికులను ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం సన్మానించి, బహుమతులు అందజేసి మాట్లాడారు. మహిళా సాధికారతకు సమష్టిగా కృషి చేద్దామన్నారు. ప్రతినెలా మహిళలకు రూ.2,500 ఇస్తామని, అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అయినా ఆ ఊసే లేదన్నారు. వృద్ధులకు రూ.4వేల పెన్షన్, దివ్యాంగులకు రూ.6వేల పెన్షన్ ఎటు పోయిందని ప్రశ్నించారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ అని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇస్తామని చెప్పి ఏమీ అమలు చేయలేదన్నారు. కేసీఆర్ హయాంలో వృద్ధుల పెన్షన్ రూ.200 నుంచి రూ.2వేలు అయిందని, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారని, సన్న బియ్యంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, కేసీఆర్ కిట్టు పేరిట బాబు పుడితే రూ.12వేలు అమ్మాయి పుడితే రూ.13వేల ఆర్థికసాయం చేశారని గుర్తు చేశారు. ఆడబిడ్డల పెళ్లికి రూ.లక్షా16వేలు అందించారని, ఆడపిల్లలకు ప్రత్యేక బాలికల గురుకులాలు ఏర్పాటు చేశారని, బాలింతలు గర్భిణులను ఆస్పత్రికి తీసుకురావడం, ప్రసవానంతరం 104 వాహనం ద్వారా ఇంటికి చేర్చడం వంటి మహోన్నత కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. మహిళల సాధికారత కోసం వీ హబ్‌ను ప్రారంభించి ఎంతో మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దారని, మహిళలకు వడ్డీ లేని రుణాలు, మహిళా పారిశ్రామికవేత్తలకు 30 రాయితీలు కల్పించారని, స్థానిక సంస్థల్లో 50 శాతం మహిళలకు రిజర్వేషన్ అమలు చేశారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇమ్మడి లోహితారాజు, నాయకులు పులి రజినీకాంత్, కొండపాక రఘు, స్నేహిత్, రఘు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్, పక్కన ఎమ్మెల్యే తదితరులు

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళ లు

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ, మార్చి 8 : ఏ రంగంలో చూసినా మహిళలు పోటీ తత్వంతో ముందు వరుసలో నిలుస్తున్నారని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించి మాట్లాడారు. కాళోజీ కళా క్షేత్రంలో మొదటిసారి నిర్వహిస్తున్న మహిళా దినోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లాకు రాణి రుద్రమదేవి ఆశీస్సులు ఉన్నాయేమో.. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మన జిల్లాలకు కలెక్టర్లు, జిల్లా పరిషత్ చైర్మన్లు, కమిషనర్లు, పోలీస్ అధికారులుగా మహిళలే ఎక్కువగా వస్తున్నారన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళలపై గృహహింస కేసులు పెరుగుతున్నాయని, బాధితులకు సమీప అంగన్‌వాడీ కేంద్రాల బాధ్యులు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. మహిళా సంఘాలను అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల్లో భాగస్వామ్యం చేసినట్లు తెలిపారు. మహిళల సంఘాల ద్వారా ఆర్టీసీ బస్సులు, సోలార్ శక్తి ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మహిళలను ఎమ్మెల్యే, మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ సత్కరించారు. డీడబ్ల్యూవో జయంతి, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర ఈసీ మెంబర్ ఈవీ శ్రీనివాసరావు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు హైమవతి, కేయూ పాలకమండలి సభ్యురాలు అనితారెడ్డి, ఆర్జేడీ ఝాన్సీ లక్ష్మీబాయి, కార్పొరేటర్ రావుల కోమల, ఏపీడీ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

అగ్రవర్ణాలు లబ్ధి పొందేందుకే మహిళా బిల్లు

- బీసీలకు సబ్ కోటా కల్పించకపోతే ఢిల్లీని దిగ్బంధిస్తాం..
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్


మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్ గౌడ్

హనుమకొండ, మార్చి 8 : మహిళా బిల్లులో బీసీలకు సబ్ కోటా కల్పించకపోతే ఢిల్లీని దిగ్బంధిస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ బిల్లు పూర్తిగా అగ్రవర్ణాలు లబ్ధి పొందేందుకేనని అన్నారు. పటేళ్ల స్థానంలో పటేలమ్మలు, దొరల స్థానంలో దొరసానమ్మలు చట్టసభల్లో తీసుకువచ్చేందుకే ఉపయోగ పడుతుందన్నారు. వడ్డేపల్లి రోడ్ కనుకదుర్గ కాలనీలో బీసీ మహిళా సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షురాలు మాదం పద్మజాదేవి అధ్యక్షతన శనివారం మహిళా దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 78 ఏళ్ల స్వాతంత్ర్య భారతదేశంలో 94మంది మహిళలు చట్టసభల్లో అడుగుపెడితే, ఇందులో 54మంది అగ్రకుల మహిళలేనని, రాష్ట్రంలో 8 మంది మాత్రమే బీసీ మహిళలు ఎమ్మెల్యేలు అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ సబ్ కోటా పెట్టే వరకు మహిళలంతా సమ్మక్క-సారలమ్మ, రాణి రుద్రమదేవి, చాకలి ఐలమ్మ వలె కేంద్రంపై పోరాడాలని ఆయనపిలుపునిచ్చారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ మాట్లాడుతూ.. విద్యతోనే మహిళా సాధికారత సాధ్యమన్నారు. బీసీ మహిళా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు మణి మంజరి మాట్లాడు తూ.. మహిళలు సావిత్రీబాయిని ఆదర్శంగా తీసుకొని రాణించాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, ఎమ్మెల్యే సతీమణి నాయిని నీలిమ, కార్పొరేటర్ గుజ్జుల వసంత, బీసీ మహిళా సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తమ్మలా శోభారాణి, జిల్లా అధ్యక్షురాలు మాడిశెట్టి అరుంధతి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో చెట్లు దగ్ధం

మడికొండ, మార్చి 8 : మడికొండ నగర పోలీస్ శిక్షణ కేంద్రం వెనుక వైపు గల ఇంద్రనగర్ రైల్వే ట్రాక్ వద్ద అగ్ని ప్రమాదం సంభవించింది. స్థానికులు డయల్ 100కు ఫోన్ చేయడంతో హెడ్ కానిస్టేబుల్ రామనాథం, కానిస్టేబుల్ వాసు, రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేసేందుకు ప్రయత్నించారు. సమాచారం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. పోలీసులు సకాలంలో స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

కాజీపేట మీదుగా మరో స్పెషల్ రైలు

కాజీపేట, మార్చి 8 : హోలీ పండుగ ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని కాజీపేట మీదుగా స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. చర్లపల్లి-గోరఖ్‌పూర్-చర్లపల్లి మధ్య 07715/07716 నంబర్లతో ఈ రైళ్లు నడిపిస్తున్నట్లు చెప్పారు. చర్లపల్లి నుంచి ఈ నెల 10న మధ్యాహ్నం 2గంటలకు ఈ రైలు (07715) బయలు దేరి సాయంత్రం 4 గంటలకు కాజీపేటకు చేరుకుని తిరిగి బయలుదేరి రెండో రోజు ఉదయం 5గంటలకు గోరఖ్‌పూర్ రైల్వే స్టేషన్‌కు చేరుకుంటుంది. గోరఖ్‌పూర్ నుంచి 07716 నంబర్‌తో ఈ నెల 12న ఉదయం 8గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 9.30 గంటలకు కాజీపేటకు, రాత్రి 11.30 గంటలకు చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు రాకపోకల్లో కాజీపేట, మంచిర్యాల, సిర్‌పూర్ కాగజ్‌నగర్, బల్లార్షా, చంద్రాపూర్, నాగపూర్, ఇటార్సీ, రాణి కమలపాటి, బీన, ఝాన్సీ, ఓరాయ్, పోకర్యాన్, కాన్‌పూర్ సెంట్రల్, లక్నో, బరబాంకీ, గోండా, బస్తీ రైల్వే స్టేషన్లలో ఆగుతుందని తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

DUPLEX HOUSE FOR SALE

★G+2 New Constructed Duplex House For Sale at Prime Location. Near Hanuman Junction Wgl. Ready to Occupy (Ground Two Car Parking + Single Bed Room, 1&2nd Duplex + Pent House. Cont: 8985694099.
NTW-6564

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-326545

పాస్‌పోర్టు పోయినది

★నేను, Sathwika Kodam, D/o Kodam Krishna, R/o H.No. 16-5-110, Peruka-wada, Warangal City & Dist-506002. నేను తేది. 02-03-2025 రోజున మం|| 2 గంటల తరువాత అదాలత్, హన్మకొండ నుండి సుబేదారికి ఆటోలో వెళ్ళే దారిలో నా ఒరిజినల్ పాస్‌పోర్టు నెం. Y3437537 గలది పోయినది. సెల్: 8008079456.
NTW-000

శ్రీ లక్షిప్రసన్నరియల్ ఎస్టేట్స్

★రామన్నపేట: G+2, 3 బెడ్‌రూమ్స్, 2 సింగిల్ పోర్షన్స్, 2 సింగిల్ బెడ్ రూమ్స్, 204 గజాలు, 80 లక్షలు, G+1, 30 Lakhs, G+2, 2, 20, Co, G+1, 1.50 C 204, 65 Lakhs, 73.18 Lakhs, G+1, 84.45 Lakhs. Cell: 8096104080, 9292104080
NTW-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పేరు మార్పు

నా పేరు లకావత్ శోభ, భర్త: లకావత్ సైదా, (ఆర్మీ నెం. 2615686N), ఇ.నెం. 6-53, KRK తండా, గుండెపురి గ్రామం, తిరుమలగిరి మండలం, సూర్యపేట జిల్లా, తెలంగాణ రాష్ట్రం. నా పేరు ఇంతకు ముందు భూక్య శోభ అని ఉన్నది. ఈ పేరును లకావత్ శోభ గా మార్చబడినది. అన్ని రికార్డుల కొరకు.

CHANGE OF NAME & AD